1

సాక్షి తిరుపతి

బుధవారం। 27। ఆగస్టు। 2025

రారండోయ్. వేడుక చూద్దాం!


కాంతులీనుతున్న కాణిపాక ఆలయం

- నేటి నుంచి కాణిపాక వార్షిక బ్రహ్మోత్సవాలు
- శోభాయమానంగా ఆలయం ముస్తాబు

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. బుధవారంతో చవితి ప్రారంభమై సెప్టెంబర్ 16తో ఈ ఉత్సవం ముగియనుంది. నెల రోజులల పాటు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగాయి. ఆలయ క్షేత్రాన్ని శోభయమానంగా తీర్చిదిద్దారు. భక్తుల వసతికి ఎలాంటి లోటూ లేకుండా అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టారు. క్యూలను విస్తరించారు. ఉచిత, శ్రీఘ్ర, అతిశ్రీఘ్ర దర్శనాల క్యూలను పెంచారు. మరింత మందికి అన్నదానం చేసేలా ఏర్పాట్లు చేపట్టారు. ముందస్తు రద్దీ దృష్ట్యా ప్రసాద విక్రయ కేంద్రం వద్ద కూడా క్యూలైన్లు పెట్టారు. మరమ్మతు పనులను పూర్తి చేశారు. ఆలయానికి రంగులు అద్ది.. కొత్త కళను తీసుకొచ్చారు. రథం, వాహనాలకు సైతం రంగులు వేశారు. అలాగే రంగువల్లులు వేసి వాటికి పెయింటింగ్ వేసి ఆకట్టుకునేలా చేశారు. ఇటూ చిత్తూరు నుంచి..అటు తిరుపతి మార్గం నుంచి స్వాగతం పలుకుతూ రోడ్డుకు ఇరువైపులా స్వాగత కటౌట్లను కట్టారు. మరమ్మతులకు గురైన పట్నంరోడ్డును బాగుచేయించారు.

హోమపూజలు, పార్కింగ్

ఆలయ ఆవరణలో హోమ, యజ్ఞ పూజలు సైతం నిర్వహించేందుకు ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్‌ను ముందస్తుగానే గుర్తించి.. మూడు చోట్ల పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. గణేష్ సేవాసదన్ భవనానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో బస్సులు, పెద్దపెద్ద వాహనాలు నిలిచేందుకు అనువుగా స్థలాన్ని కేటాయించారు. బస్టాండు ఆనుకుని ఉన్న స్థలంలో ఆటోలు, కార్లు పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేపట్టారు. ఈవో నివాస భవనం వెనుక భాగంలో కూడా పార్కింగ్‌కు సిద్ధం చేశారు.


సిద్ధమైన అలంకరణలు

అంతరాలయ దర్శనం రద్దు

శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం అంతరాలయ దర్శనాన్ని రద్దు చేసినట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉదయం నుంచి రాత్రి 10గంటల వరకు స్వామి దర్శనం ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

పారదర్శకతకే స్మార్ట్‌కార్డులు


ఎస్టీ కాలనీలో స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేస్తున్న కలెక్టర్

చంద్రగిరి : మండల పరిధిలోని తొండవాడ లింగాల కుంట ఎస్టీ కాలనీలోని స్థానికులకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేపట్టారు. మంగళవారం గ్రామానికి చేరుకున్న ఆయన ఎస్టీ కాలనీలో నివసిస్తున్న భూదేవమ్మ, నారాయణమ్మ, గంగాదేవి ఇతర కాలనీ వాసులకు కార్డులు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో చౌక దుకాణాల ద్వారా పారదర్శకంగా నిత్యావసర సరుకులు పొందడం కోసం స్మార్ట్ రైస్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తూ అక్కడున్న కాలనీవాసులకు పెన్షన్, రేషన్ సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఆర్డీఓ రామ్మోహన్, గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వో, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుల కోసం పడిగాపులు


రేణిగుంట సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

రేణిగుంట : పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని, ఐదు రోజులు మాత్రమే గడువు అనడంతో లబ్ధిదారులు ఆందోళనతో సచివాలయానికి పరుగులు తీశారు. రేణిగుంట ఒకటో సచివాలయం ఆవరణలో మంగళవారం ఉదయం స్మార్ట్ రేషన్ కార్డుల కోసం సుమారు 200 మంది పడిగాపులు పడ్డారు. చాలాసేపు నిరీక్షించిన తరువాత ఇద్దరు సచివాలయ సిబ్బంది రావడంతో ఒక్కసారిగా లబ్ధిదారులు చుట్టుముట్టడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని విలేకరులు తహసీల్దార్‌కు వివరించగా వెంటనే స్పందించిన తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సిబ్బందికి సూచనలు చేయడంతో సచివాలయం నుంచి లబ్ధిదారులను వారి ఇళ్లకు పంపించారు. అనంతరం వీఆర్వోలు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ కార్డుల పంపిణీని కొనసాగించారు.

మద్యం బార్లకు 29 వరకు గడువు

– 30న లాటరీ

తిరుపతి క్రైమ్ : జిల్లాలో మద్యం బార్ల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 29వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 32 మద్యం బార్లకు 2025–28 సంవత్సరానికి గానూ మూడేళ్ల వరకు లైసెన్సులు మంజూరు చేయడానికి ఇటీవల అధికారులు నోటిఫికేషన్స్ ఇవ్వగా.. దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం వరకు గడువు ఇచ్చారు. అయితే దుకాణాలకు ఎవ్వరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో ఈ గడువును మరో మూడు రోజులు పొడిగించారు. అలాగే కల్లుగీత సామాజిక వర్గానికి చెందిన ఓ దుకాణానికి సైతం 29వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అన్ని బార్లకు శుక్రవారం సాయంత్రం 6 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని, 30వ తేదీ ఉదయం 8 గంటలకు తిరుపతిలోని కలెక్టరేట్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో డిప్ తీసి, లైసెన్సులు కేటాయిస్తామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇక మంగళవారం సాయంత్రానికి 32 బార్లకు 13 దరఖాస్తులు మాత్రమే అందాయి. ఒక్కో బార్‌కు తప్పనిసరిగా నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ నిర్వహిస్తామని ఇప్పటికే అధికారులు స్పష్టం చేశారు. నాలుగు దరఖాస్తులు రానిపక్షంలో లాటరీ రద్దు చేసి.. దరఖాస్తు రుసుం రూ.5 లక్షలు వాపసు ఇస్తామని పేర్కొన్నారు.

మండపాల్లో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు

నాయుడుపేటటౌన్ : జిల్లా పరిధిలో వినాయక చవితి సందర్భంగా మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎస్ఈ సురేంద్ర నాయుడు ఆదేశించారు. అన్ని గ్రామాల్లో త్రీ ఫేజ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో మంగళవారం నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని డీఈలు, ఏఈలు తదితరులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా జిల్లా పరిధిలో సోలార్ విదుత్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే జిల్లా కొన్ని గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి సోలార్ విద్యుత్ వినియోగం జరుగుతోందన్నారు. విద్యుత్ బిల్లులను వంద శాతం వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఈఈ శ్రీనివాసులు, డీఈలు వరప్రసాద్‌రెడ్డి, ఆర్ శేఖర్, శ్రీనివాసులు, 12 మండలాలకు చెందిన, ఏఈలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్ర నాయుడు

తేలిపోయిన కుట్రలు



టీడీఆర్ బాండ్ల వివరాలు

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లు	23
రోడ్ల అభివృద్ధితో స్థలాలు కోల్పోయిన బాధితులు	1077
ఇప్పటి వరకు బాధితులకు ఇచ్చిన టీడీఆర్ బాండ్లు	709
ఇంకా ఇవ్వాల్సినవి	368
ఇందులో కమిటీ ముందు ఉన్నవి	22
కార్పొరేషన్‌కు గిఫ్ట్ డీడ్ రాసి ఇవ్వాల్సిన వారు	162
టీడీఆర్ బాండ్లు వద్దు స్థలమే కావాలి అని అడిగిన వారు	39
ఇతర దేశాల్లో ఉన్న బాధితులు	24
ఆ స్థలం మాది అని ఇంకా క్లైమ్ చేయనివారు	48
ఆ ప్రాపర్టీ మాదేనంటూ కోర్టు మెట్లు ఎక్కిన వారు	59

2014 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లో మీడియాతో కలిసి టీడీపీ నేతలు లక్ష కోట్ల అవినీతి బురదను అంటించారు. పచ్చి అబద్ధాన్ని పదే పదే చెప్పించి, రాయించి ప్రజలను నమ్మించారు . లేనిపోని అవినీతి అబద్ధాలతో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి ఆ ఎన్నికల్లో గద్దెనెక్కారు.

2024 ఎన్నికల్లోనూ ఇదే తరహా ప్రచారంతో అధికారంలోకి వచ్చేందుకు కుట్రకు తెరలేపారు. రోడ్ల అభివృద్ధి పేరుతో తిరుపతిలోనే రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందంటూ పచ్చి అబద్ధాన్ని ఎన్నికల అస్త్రంగా చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల అవినీతి జరిగిందని టీడీపీ నేతలు బుకాయిస్తే పచ్చపత్రికల్లో పదే పదే వండి వర్చారు. జగన్ గెలిస్తే మీ భూములు లాక్కుంటాడంటూ మరో అబద్ధాన్ని ప్రజలపై రుద్ది భయభ్రాంతులకు గురి చేశారు. అక్రమాలు అవినీతి మరకలతో మరోసారి గద్దెనెక్కారు.

తిరుపతి టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై కూటమి కుట్రలు తేలిపోయాయి. గతంలో ఇక్కడ వందల కోట్ల అక్రమాలు జరిగాయని బుకాయించారు. కూటమి అధికారంలోకి వస్తే అక్రమాలు నిగ్గు తెలుస్తామని బీరాలు పలికారు. అబద్ధపు హామీలు, అసత్య ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టి కూటమి అధికారంలోకి వచ్చింది. ఏడాదిన్నరగా విజిలెన్స్ విచారణ చేపట్టింది. ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదని నిరూపితమైంది. ఇదే విషయాన్ని కొందరు అధికారులు బహిర్గతం చేశారు. పైగా సంబంధిత మంత్రి నారాయణ కూడా తిరుపతి బాండ్ల వ్యవహారంలో ఒకటి రెండు మినహా ఇక్కడ ఏమీ జరగలేదని అధికారుల సమీక్షలోనే కుండబద్ధలు కొట్టడం గమనార్హం.

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రోడ్ల అభివృద్ధి పేరుతో రెండు వేల కోట్ల అవినీతి జరిగిందంటూ చేసిన ఆరోపణలు తేలిపోయాయి. రోడ్ల అభివృద్ధికి స్థలాలు ఇచ్చిన బాధితులకు అన్యాయం చేశారంటూ చేసిన ఆరోపణలు బూటకమని నిర్ధారణ అయింది. తాము అధికారంలోకి వస్తే అవినీతిని నిగ్గు తేల్చి ఆ సొమ్మును రికవరీ చేస్తామని చెప్పిన మాయమాటలు డొల్లేనని తేలిపోయింది. అధికారంలోకి వచ్చాక టీడీఆర్ బాండ్లపై విజిలెన్స్ విచారణ చేపట్టినా అందులో అవినీతి లేదని తేల్చేశారు. ఆ శాఖను పర్యవేక్షిస్తున్న మంత్రి నారాయణ సైతం తిరుపతిలో వచ్చిన టీడీఆర్ బాండ్ల అవినీతి ఆరోపణల్లో పసలేదని కుండలు బద్ధలు కొట్టారు. ఒకటి రెండు మినహా ఇక్కడ అంతా సవ్యంగా జరిగిందేనని మీడియా సాక్షిగా నిర్ధారించడంతో నాడు వైఎస్సార్‌సీపీ నేతలకు అంటించిన టీడీఆర్ బాండ్ల అవినీతి మరక కేవలం పచ్చి అబద్ధాలేనని తేటతెల్లమైంది. దీంతో ఇంత పచ్చి అబద్ధాన్ని, లేనిపోని అవినీతిని అండగట్టి రాష్ట్రవ్యాప్తంగా తిరుపతిలో ఏదో జరిగిపోయింది అంటూ నానా యాగి చేసిన పచ్చనేతలకు మైండ్ బ్లాక్ అయింది. పచ్చి అబద్ధాలతో పచ్చపార్టీకి అనుకూలంగా తప్పుడు రాతలను వండివార్చిన టీడీపీ అనుకూల మీడియాకు దిమ్మ తిరిగింది.

అవినీతి మాటలు.. అవాస్తవ ఆరోపణలు!

- రూ.2 వేల కోట్ల స్కామ్ అంటూ విష ప్రచారం
- ఎన్నికల ఆయుధంగా ఆరోపణలతో ఎక్కుపెట్టిన కూటమి నేతలు
- అబద్ధాన్ని పదే పదే వండివార్చిన పచ్చపత్రికలు
- విజిలెన్స్ విచారణలో తేలిపోయిన వ్యవహారం
- మంత్రి వివరణతో ఆరోపణలన్నీ డొల్లేనని స్పష్టం

నిరాధార ఆరోపణలు..

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నేతలకు ఇది పెద్ద రాజకీయ అస్త్రంగా మారింది. టీడీఆర్ బాండ్ల వెనుక పెద్ద కుంభకోణం జరిగిందని నిరాధార ఆరోపణలు చేశారు. తప్పుడు లెక్కలు, లేనిపోని కాగితపు లెక్కలతో అయోమయం సృష్టించారు. ఇదే విషయాన్ని పదే పదే పచ్చ పత్రికల్లో తప్పుడు రాతలు రాసి తిరుపతి కార్పొరేషన్‌లో ఏదో జరిగిపోయిందనే భ్రమను కల్పించారు. భవిష్యత్తులో ఎవరైనా అభివృద్ధి చేయాలంటే అవసరమా అని ఆలోచించే స్థాయికి తీసుకొచ్చారు. తాము చేసిన అభివృద్ధిని ఎన్నికల అస్త్రంగా చేసుకోవాలని భావించిన భూమన అభినయ రెడ్డికి అదే వ్యవహారం తప్పుడు ఆరోపణలతో అవినీతి మరకలను అంటించింది.

నాడు ఎన్నికల అస్త్రంగా బాండ్ల వ్యవహారం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధితో తిరుపతి నగరం మరో 40 ఏళ్ల ముందుకు వెళ్లింది. చివరి మూడేళ్లలో నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఏకంగా 23 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేసి చూపించారు. ఈ అభివృద్ధిని ఓర్వని టీడీపీ నేతలు రోడ్ల వ్యవహారాన్ని ఎన్నికల అస్త్రంగా మార్చుకున్నారు. రోడ్ల అభివృద్ధికి స్థలాలు కోల్పోయిన వారికి నష్ట పరిహారం బదులు టీడీఆర్ బాండ్లు (ట్రాన్స్ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్) వ్యవస్థను 2016లో తీసుకొచ్చారు. స్థలం కోల్పోయిన యజమానికి అక్కడ కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రతిపాదికన విలువ కట్టి టీడీఆర్ బాండ్లను అందిస్తారు. భవన నిర్మాణదారులు వీటిని కొనుగోలు చేస్తుంటారు. తద్వారా అదనపు అంతస్తులు, సెట్ బ్యాక్ విషయంలో టౌన్ ప్లానింగ్ నుంచి కొన్ని సడలింపులు పొందుతుంటారు. ఇంత వరకు బాగానే ఉన్నా టీడీఆర్ బండ్ల వ్యవహారంలో రెండు వేల కోట్లు చేతులు మారాయని దీని వెనుక నాటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆయన తనయుడు భూమన అభినయ రెడ్డి హస్తం ఉందంటూ తప్పుడు ఆరోపణలు చేశారు.

మంత్రి మాటలతో స్పష్టత

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ తుడపై సమీక్ష నిర్వహించే క్రమంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై స్పందించారు. తిరుపతి బాండ్ల వ్యవహారంలో ఒకటి రెండు మినహా ఇక్కడ ఏమీ జరగలేదని అధికారుల సమీక్షలోనే స్పష్టం చేశారు. తణుకు మున్సిపాలిటీలో మాత్రమే కొంత తేడాలు ఉన్నాయని ఆ మాత్రం కూడా మరి ఏ మున్సిపాలిటీలోనూ లేవని ఆయన అందరికీ అర్థమయ్యేలా చెప్పారు. ఇదే విషయాన్ని సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోనూ చెప్పారు. ఈ క్రమంలో కొందరు విలేకరులు ఈ వ్యవహారాన్ని పదే పదే ప్రస్తావించగా .. ఆయన కొన్ని ఏమైనా జరిగాయేమో లే అంటూ మరో మాటగా చెప్పారు. ఆ శాఖను పర్యవేక్షిస్తున్న మంత్రి చాలా స్పష్టంగా తిరుపతిలో ఒకటి రెండు మినహా ఎలాంటి అవినీతి అక్రమాలు జరగలేదని తేల్చి చెప్పినా ఇప్పటికీ కొంత మంది కూటమి నేతలు నాటి నిరాధార ఆరోపణలనే ప్రస్తావించడం చూస్తుంటే భూమన కుటుంబంపై వారు ఎంత కక్ష పూరితంగా ఉన్నారో అర్థమవుతోంది. గత ప్రభుత్వ హయాంలోనే దాదాపు 500 పైగా టీడీఆర్ బాండ్లను వేగంగా నిస్పక్షపాతంగా అందించారు. కొన్ని లీగల్ మరికొన్ని టెక్నికల్ సమస్యల కారణంగా సకాలంలో ఇవ్వలేకపోవడాన్ని భూమన కుటుంబమే కారణమంటూ నిందలు మోపారు. టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో పసలేదని మంత్రి మాటలు స్పష్టం చేశాయి. ఆ ఆరోపణలన్నీ డొల్లేనని తేటతెల్లమైంది.

కొండను తవ్వి.. ఎలుకనూ కూడా పట్టలే!

టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో వందల కోట్ల అక్రమాలు జరిగాయని బుకాయించి, ఇదే విషయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మార్చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లోనూ ఈ వ్యవహారాన్ని ఇదే తరహా తప్పుడు ఆరోపణలతో అవినీతి మరకలను అంటించారు. తమ అధికారంలోకి వస్తే అవినీతి నిగ్గు తెలుస్తామని, ఆ డబ్బును తిరిగి కక్కిస్తామంటూ మాయ మాటలు చెప్పారు. అసత్య ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టి టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. తొలి నాళ్లలో దీనిపై నానా హంగామా చేశారు. విజిలెన్స్ విచారణ చేపట్టారు. విజిలెన్స్ విచారణలో ఎలాంటి అవినీతి జరగలేదని నిరూపితమైంది. ఇదే విషయాన్ని ఇటీవల కొందరు అధికారులు బహిర్గతం చేశారు. టీడీఆర్ బాండ్ల అవినీతి కొండను తవ్వి ఎలుక కాదు కదా చిన్న చలి చీమను కూడా పట్టలేక పోయారు.

బ్రహ్మోత్సవాలకు సిద్ధంకండి

- తిరుపతి బస్టాండ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

తిరుపతి అర్బన్ : తిరుమల బ్రహ్మోత్సవాలకు అంతా సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విజయవాడ నుంచి విచ్చేసిన ఆయన మంగళం, తిరుపతి డిపోలను పరిశీలించారు. అనంతరం తిరుపతి గ్యారేజ్‌లో అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్‌లో జరగనున్న తిరుమల బ్రహ్మోత్సవాలకు ఇప్పటి నుంచి ఓ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని పేర్కొన్నారు. కండిషన్ ఉండే సర్వీసులను మాత్రమే ఎంపిక చేయాలని ఆదేశించారు. అలాగే స్త్రీశక్తి పథకానికి సంబంధించి ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తిరుపతిలోని శ్రీహరి బస్టాండ్ తొలగింపులో పలు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమీప ప్రాంతాల్లో ప్రయాణికులు లేకుండా చూడాల్సి ఉందన్నారు. గడువు మేరకు పనులు పూర్తి చేయాలని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీటీవో జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, మెకానిక్ ఇంజినీర్ బాలాజీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.1,04,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.9,355
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.1,19,800
రిటైల్ వెండి గ్రాము రూ.122.80

స్మార్ట్..తిప్పలు

- 40,334 మందికి అందని కొత్త రేషన్ కార్డులు
- మిగిలిన వారికి సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో అంటున్న అధికారులు

తిరుపతి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు తప్పుల తడకగా మారాయి. స్మార్ట్ కార్డుల్లో పైన పసుపు రంగు వచ్చేలా ముద్రించారు. కుటుంబ సభ్యుల పేర్లు వద్ద పుట్టిన తేదీ వివరాలను పొందుపరిచారు. అయితే ఆ వివరాల్లో పెద్ద ఎత్తున తప్పులు చోటు చేసుకున్నాయి. దీంతో స్మార్ట్ రేషన్‌కార్డులను అందుకున్న కార్డుదారులు లబోదిబోమంటున్నారు. ఏడాదిపాటి సమయం తీసుకున్న ప్రభుత్వం ఇలా తప్పులతో కూడిన కార్డులను ఇవ్వడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తప్పుల సవరణకు మళ్లీ రూ.50 చెల్లించి సచివాలయంలో మార్పు చేసుకోవాల్సి ఉందని చెబుతున్నారు. అయితే ప్రభుత్వం తప్పుల సవరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సమయంలో మాత్రమే చేసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. అప్పటి వరకు తప్పులున్న స్మార్ట్ కార్డులతోనే నెట్టుకురావాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో పాత రేషన్ కార్డులు 5,87,001 ఉన్నాయి. అందులో 5,80,120 మందికి మాత్రమే స్మార్ట్ కార్డులు వచ్చాయి. మిగిలిన 6,881 మందికి స్మార్ట్ కార్డులు రాలేదు. మరోవైపు కొత్త కార్డులు 33,453కి స్మార్ట్ కార్డులు రాలేదు. మొత్తంగా జిల్లాలో 40,334 మందికి స్మార్ట్‌కార్డులు అందలేదు. సచివాలయాల్లో స్మార్ట్ కార్డులను అందించారు. మరోవైపు పాత ఈ–పాస్ మిషన్ల స్థానంలో కొత్త మిషన్లు సెప్టెంబర్‌లో జారీ చేస్తారనే చర్చ సాగుతోంది.



స్మార్ట్ రేషన్‌కార్డు

మిగిలిన వారికి త్వరలో వస్తాయి..



పాత, కొత్త రేషన్ కార్డులకు సంబంధించి మొత్తంగా 40 వేల మంది వరకు స్మార్ట్ కార్డులు రావాల్సి ఉంది. మిగిలిన వారికి సెప్టెంబర్‌లో ఇచ్చారని తెలుస్తోంది. అలాగే తప్పులు ఉంటే సచివాలయంలో ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సమయంలో మార్పు చేసుకోవాల్సి ఉంటుంది.
– శేషాచలం రాజు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

తిరుమల ఘాట్‌లో తప్పిన ప్రమాదం

- విరిగిపోయిన ఆర్టీసీ బేరింగ్ రాడ్


ప్రమాదానికి గురైన కారు

తిరుమల : ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు ముందు చక్రం బేరింగ్ రాడ్డు విరిగిపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా బస్సును ఆపడంతో భక్తులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు తిరుమల నుంచి తిరుపతికి ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన సప్తగిరి ఎక్స్ ప్రెస్ బస్సు 25 మంది ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరింది. బస్సు 57 మలుపు వద్దకు చేరుకోగా అకస్మాత్తుగా బస్సు ముందరి టైరు బేరింగ్ రాడ్ విరిగిపోయింది. దీంతో బస్సు ఒక్కసారిగా రోడ్డుకు రాసుకుంటూ కొంతదూరం వెళ్లి ఆగిపోయింది. బస్సు వేగం తక్కువగా ఉండడంతో బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును ఆపివేయడంతో ప్రయాణికులు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బస్సును పక్కకు తొలగించారు. బస్సులోని ప్రయాణికులను మరో ఆర్టీసీ బస్సులో తిరుపతికి తరలించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

తిరుమల : తమిళనాడు చెన్నైకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనార్థం కారులో తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం కారులో మొదటి ఘాట్ రోడ్డు మీదుగా కిందకు దిగుతుండగా 34 మలుపు వద్ద కారు అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. అయితే కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడం, కారువేగం తక్కువగా ఉండడంతో భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కారు డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతోనే ప్రమాదం చోటుచేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఎస్వీయూలో నూతన విద్యార్థులకు ఓరియెంటేషన్



లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్న కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాలు పొందిన బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తిరుపతిలోని కౌటిల్య సంస్థ ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్స్‌పై వర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌటిల్య సంస్థ డైరెక్టర్ శ్రీధర్ ఉద్యోగ సామర్థ్య నైపుణ్యాలపై మెళకువలు విద్యార్థులకు వివరించారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు అకడమిక్ విద్యపై విద్యార్థులు పట్టు సాధించినప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఎన్ఎస్ రెడ్డి, ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ప్రొఫెసర్ సుబ్బారావు, కోర్డినేటర్ డాక్టర్ మునిలక్ష్మి, డీన్లు, డైరెక్టర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీచ్ వద్ద నిమజ్జన ఏర్పాట్లు

వాకాడు : మండలంలోని తూపిలిపాళెం బీచ్ వద్ద మంగళవారం రెవెన్యూ, పోలీసు అధికారులు నిమజ్జ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిమజ్జనానికి వచ్చే భక్తులకు అవసరమైన బీచ్ వద్దకు వాహన రహదారులు, షామియాన వసతి, పార్కింగ్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేశారు. మద్యం తాగి వచ్చే వారిని బీచ్ వద్దకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఎస్ఐ నాగబాబు తెలిపారు. అలాగే నిమజ్జనానికి వచ్చే భక్తులు అధికారులకు సహకరించాలన్నారు. సముద్రం వద్ద నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని ఆర్ఐ అఖిల్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే నిమజ్జనాలకు అనుమతి ఉందన్నారు. నిమజ్జనాలు జరిగే అన్ని రోజుల్లో తూపిలిపాళెం, ఓడపాళెం బీచ్‌ల వద్ద రెవెన్యూ, పోలీసు అధికారులతో భద్రత కల్పించడం జరుగుతుందన్నారు.

ఇంటర్ విద్యార్థుల ఘర్షణ

రేణిగుంట : మండల పరిధిలోని యోగానంద కాలేజ్ సమీపంలో మంగళవారం ఇంటర్ చదివే విద్యార్థులు ఘర్షణ పడ్డారు. మదనపల్లెకు చెందిన రెడ్డి వరప్రసాద్(17)కు కంటి వద్ద గాయం అవడంతో చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. గాజుల మండ్యం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈమేరకు విద్యార్థులను విచారణ చేస్తున్నారు.

సంస్కృత వర్సిటీలో అబుదాబి స్వాముల సందర్శన


వర్సిటీని సందర్శించిన అబుదాబి స్వాములు, పండితులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో అబుదాబికి చెందిన అక్షర పురుషోత్తమ మందిర ప్రముఖులు బ్రహ్మ బిహారీ దాస్ స్వామితో పాటు 60మంది సాధువులు మంగళవారం పర్యటించారు. బిహారి దాస్ స్వామి మాట్లాడుతూ, భారత దేశంలో సంస్కృత విశ్వవిద్యాలయం అద్భుతంగా ఉందని కొనియాడారు. సంస్కృతంతో పాటు అక్షర పురుషోత్తమ దర్శనాన్ని కల్పించిన వర్సిటీ అధికారులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ కడియం వెంకటనారాయణ, డీన్ దక్షిణమూర్తి శర్మ, రజినీకాంత్ శుక్లా, ఆర్వీ శేషుకుమార్, ఉత్కల పీఠం డైరెక్టర్ జ్ఞాన రంజన పండా, అధికారులు పాల్గొన్నారు.

ఇరుగుళం హైస్కూల్‌లో 'డానియేలి' చైర్మన్

నారాయణవనం : శ్రీసిటీలోని మెట్రో రైళ్ల తయారీ పరిశ్రమ డానియేలి చైర్మన్ మారేస్పి డానియేలి మంగళవారం మండలంలోని ఇరుగుళం ఉన్నత పాఠశాలను సందర్శించారు. శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో స్కూలులో తమ కంపెనీ చేపట్టిన కార్పొరేట్ సామాజిక పథకం కింద రూ.60 లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించారు. శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి, డానియేలి ఇండియా ప్రతినిధి అంబ్రోసినో డొమెనికో, సీఓఓ శ్రీనివాస్ రావు, సీఎఫ్ఓ రాజేష్, హెచ్ఆర్ సైమన్ సైజు, ప్రదీప్ తదితరులు పాఠశాలను సందర్శించిన వారిలో ఉన్నారు.


పాఠశాలను సందర్శిస్తున్న డానియేలి బృందం

కమ్మల కోసం కడతేర్చాడు

- హత్య కేసులో నిందితుడు అరెస్టు

తిరుపతి క్రైమ్ : ఈనెల 21వ తేదీన కొరమేనుగుంట సీపీఆర్ అర్బన్ అపార్ట్‌మెంట్లో వృద్ధురాలి హత్య కేసును అలిపిరి పోలీసులు ఛేదించినట్లు సీఐ రామకిషోర్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. సీపీఆర్ అర్బన్ డెవలప్‌మెంట్ అపార్ట్‌మెంట్ నంబర్ 202, బ్లాక్ నంబర్ సీలో నివాసం ఉంటున్న షణ్ముగం కొంతకాలంగా పక్షవాతంతో మంచంపైనే ఉన్నాడు. ఆయన కుమారుడు శివానందన్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. తండ్రి అనారోగ్యంతో ఉండడంతో తండ్రిని చూసుకునేందుకు బండెల రవి అనే వ్యక్తిని నియమించాడు. షణ్ముగానికి వంట చేసేందుకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఆయన చెల్లెలు ధనలక్ష్మి (73)ని అదే అపార్ట్‌మెంట్లో ఆయనతోపాటు ఉంచుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 20 తేదీన రాత్రి ఎవరూ లేని సమయంలో ధనలక్ష్మి వేసుకున్న కమ్మలపై రవి కళ్లు పడ్డాయి. ఆమె నిదురించే సమయంలో కూరగాయలు తరిగే కత్తితో గొంతు కోసి చెవులో ఉన్న సుమారు 10 గ్రాముల కమ్మలు దోచుకెళ్లాడు. నిందితుడికి ఇంతకు ముందు కూడా నేరచరిత్ర ఉన్నట్లుగా విచారణలో తేలింది అన్నారు. రవిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి బంగారు కమ్మలు స్వాధీనం చేసుకున్నామన్నారు.


హత్యకు పాల్పడిన రవి

1న వరసిద్ధుడికి సారె సమర్పణ

శ్రీకాళహస్తి: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామికి శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున సెప్టెంబరు 1న ముక్కంటి సారె సమర్పించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి సంవత్సరం ఆలయ తరఫున సారె సమర్పించడం ఆనవాయితీ అన్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు ఈ సారె అందజేస్తామని చెప్పారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

తిరుపతి సిటీ : డిగ్రీ ప్రవేశాలపై అయోమయం సృష్టించిన ఉన్నత విద్యామండలి మరోసారి దరఖాస్తులకు వచ్చేనెల 1వతేదీ వరకు గడువు పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 122 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో ఇప్పటి వరకు 50 శాతం సైతం దరఖాస్తులు రాకపోవడంతో మరోసారి దరఖాస్తు తేదీలను పొడిగించింది. తిరుపతిలోని టీటీడీ కళాశాలల్లో మాత్రమే 80శాతానికి పైగా దరఖాస్తులు రాగా జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 20 శాతం సైతం దరఖాస్తులు అందలేదని ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు.

రెండవ విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా: స్విమ్స్ నిర్వహిస్తున్న కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సుల ప్రవేశాలకు రెండవ విడత కౌన్సెలింగ్ ప్రక్రియకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28, 29వ తేదీలలో స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు https://svimstpt.ap.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

పోలేరమ్మ జాతర తొలి చాటింపు నేడు

వెంకటగిరి రూరల్: ప్రతిష్టాత్మక వెంకటగిరి పోలేరమ్మ జాతరకు సంబంధించి మొదటి చాటింపు బుధవారం అర్ధరాత్రి వేయనున్నారు. తొలుత వెంకటగిరి రాజా కుటుంబీకుల వద్ద, రాజా ప్యాలెస్‌లోని బొడ్డుచవిక వద్ద ఆలయ అధికారులు, రెడ్డి, పని బాటల వారికి అంకురార్పణ (తాంబూలాలు) ఇచ్చి జాతరకు అనుమతి ఇవ్వనున్నారు. దీంతో వెంకటగిరిలో జాతర పనులు ప్రారంభమవుతాయి.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 67,767 మంది స్వామివారిని దర్శించుకోగా 25,852 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.07 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని, కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

17 మంది జూదరుల అరెస్టు

– రూ.1.40 లక్షల నగదు, వాహనాలు స్వాధీనం

చంద్రగిరి : మండలంలోని మిట్టపాళెం పంచాయతీ శ్రీసత్యసాయి ఎస్టీ కాలనీలో రహస్యంగా జరుగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం డ్రోన్ కెమెరా సాయంతో దాడులు చేశారు. డ్రోన్ కెమెరాలో రహస్యంగా పేకాట ఆడుతున్నట్టు గుర్తించిన పోలీసులు చాకచక్యంగా అక్కడకు చేరుకుని అందరినీ అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా అందులో కొందరు అడవిలోకి పారిపోయి తప్పించుకున్నారు. 17 మందిని అదుపులోకి తీసుకుని రూ.1,40,200 నగదుతో పాటు ఐదు ద్విచక్రవాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. శేషాచల అడవులకు ఆనుకుని రహస్యంగా పేకాట ఆడుతున్నట్టు పక్కా సమాచారం ఉండటంతో తిరుపతి నుంచి సైబర్, డ్రోన్ కెమెరాల పర్యవేక్షణ అధికారి వినోద్‌కుమార్ తమ సిబ్బందిని అప్రమత్తం చేశారు. డ్రోన్ సాయంతో పేకాట స్థావరాన్ని కనుగొన్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారందరినీ చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

28న కురబల రాష్ట్ర కార్యవర్గ సమావేశం


మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్ : అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈనెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కురుబ కులస్తులు హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు నిర్వహించే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోవడంతో పాటు కురబ కుల వర్గం సంక్షేమంపై చర్చించి భవిషత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. త్వరలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో సమావేశాలు నిర్వహణతో జిల్లా నూతన కమిటీలను ఎంపిక చేసి కురబ కుల బలోపేతానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. సమావేశంలో కురబ , కురుమ, కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడి డకుమార్, కె.రాజన్న, జి.రామాంజయలు పాల్గొన్నారు.

ఫేక్ సర్టిఫికెట్లపై డేగ కన్ను

- రేపు రెండు కేంద్రాల్లో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన
- పరిశీలనకు ప్రత్యేక బృందాలు

చిత్తూరు కలెక్టరేట్: ఫేక్ సర్టిఫికెట్లపై అధికారులు డేగ కన్ను వేశారు. మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల్లో చాలా వరకు ఫేక్‌సర్టిఫికెట్లు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులకు ముందస్తు సమాచారం వెళ్లింది. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ మేరకు ఈనెల 28న చిత్తూరు జిల్లా కేంద్రానికి సమీపంలోని మురకంబట్టు వద్ద ఉన్న అపోలో యూనివర్సిటీ, ఆర్‌వీఎస్ నగర్‌లో ఉన్న ఎస్వీ సెట్‌లో సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఎంపికైన అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌లకు ఈనెల 26 నుంచి కాల్‌లెటర్లను పంపారు.

నకిలీ అయితే క్రిమినల్ కేసే

అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లను సమర్పిస్తే సంబంధిత అభ్యర్థిపై క్రిమినల్ కేస్ నమోదు చేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సూచించిన సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండవన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లు లేకపోయినా...అభ్యర్థులు పరిశీలనకు గైర్హాజరైనా ఉద్యోగం లేనట్టేనని స్పష్టం చేస్తున్నారు. దివ్యాంగులు, క్రీడా కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో పరిశీలన చేయనున్నారు. సర్టిఫికెట్ కేంద్రాల్లో అభ్యర్థులకు తప్ప మిగిలిన వ్యక్తులకు, మీడియాకు అనుమతి లేదని డీఈవో వరలక్ష్మి వెల్లడించారు.


MEGA DSC (TEACHER RECRUITMENT TEST) – 2025
CALL LETTER FOR CERTIFICATE VERIFICATION

To
HT No:
Name:
Address:
Contact No:
Email:

It is hereby informed that Sri / Smt. / Kumari ... appeared for Mega DSC – 2025, is hereby requested to attend for Certificate Verification in person as per the schedule given below.

Date of certificate verification: 28-Aug-2025
Venue: RAYALASEEMA UNIVERSITY, Nandyala Road, Panyapalle, Kurnool, Andhra Pradesh 518007
Time: 9.00 AM

Before attending for certificate verification, please upload all relevant certificates/documents at candidate login

Further, it is informed that issuance of a call letter for certificate verification does not confer any right to selection. Attendance at certificate verification is solely for the purpose of confirming the particulars furnished in the online application. The final selection of candidates will be subject to merit, eligibility, reservation, and other prescribed conditions.

If the candidate fails to attend certificate verification, or fails to produce the required certificates at the time of verification, or if the certificates are found to be non-genuine or incorrect, such candidates shall forfeit the right of selection, and the next eligible candidate will be considered for certificate verification.

List of Original Documents to be Produced:
1. Printout of the Online Application of Mega DSC-2025.
2. SSC or its equivalent certificate.

ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులకు పంపిన కాల్‌లెటర్

తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు ఇవే

- అభ్యర్థులకు పంపిన కాల్‌లెటర్ కాపీ
- సంబంధిత విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు
- ఇటీవల జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రం (వర్తించినచో).
- అంగవైకల్యం ధ్రువీకరణ పత్రం (వర్తించినచో).
- కాల్‌లెటర్‌లో సూచించిన ఇతర సర్టిఫికెట్లు
- గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన 3 సెట్ల జిరాక్స్ కాపీలు
- 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు

వ్యర్థాలతో జాతీయ రహదారి నిర్మాణ పనులు

- నాసిరకం పనులపై స్థానికుల మండిపాటు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

తిరుపతి రూరల్ : నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిలోని గాజులమండ్యం నుంచి సి.మల్లవరం జంక్షన్ వరకు ఎన్‌హెచ్ 205 రోడ్డు (నాలుగు నుంచి ఆరు వరుసలకు) విస్తరణ పనులను శరవేగంగా చేస్తున్నారు. అయితే రహదారి నిర్మాణ పనులు చేపట్టిన కంపెనీ వారు పనులను నాసిరకంగా నిర్వహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణంలో కీలకమైన మట్టి పనులను నాసిరకంగా చేయడంతో కోట్ల రూపాయల నిధులు వృథా అవుతాయని హెచ్చరిస్తున్నారు. రహదారి నిర్మాణంలో భాగంగా తిరుపతి రూరల్ మండలం బాలాజీ డెయిరీ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఎంతో కాలం నుంచి పడేసిన చెత్తతో కూడిన వ్యర్థాలను రహదారి పనుల్లో ఉపయోగించి పైన ఎర్రమట్టి వేసి మొక్కుబడిగా పనులను పూర్తి చేసేస్తున్నారు. రాత్రిపూట వ్యర్థాలతో కూడిన మట్టిని వేసి తెల్లవారే సరికి దానిపై కొంత ఎర్రమట్టి వేసి ఎవ్వరికీ అనుమానం రాకుండా మట్టిపనులు పూర్తి చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాణ్యతతో పనులు చేపట్టాలని లేని పక్షంలో రహదారి పనులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేస్తామని పేరూరు, పాతకాల్వ, సి.మల్లవరం గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు. కోట్ల రూపాయల నిధులు వృథా అవుతున్నా ఎన్‌హెచ్ఏఐ అధికారులు కన్నెత్తి చూడటం లేదని, కలెక్టర్ రహదారి నిర్మాణ పనులను పరిశీలన చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


రహదారి నిర్మాణ పనుల్లో వ్యర్థాలతో కూడిన మట్టిని వినియోగిస్తున్న దృశ్యం

టీటీడీకి స్కానర్ విరాళం


స్కానర్ విరాళ మంజూరు కాపీని ఈఓకు అందజేస్తున్న ఐఓబీ డైరెక్టర్

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుపతి రీజినల్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ యాజమాన్యం టీటీడీకి రూ.61.72 లక్షల విలువ గల స్మిత్ డిటెక్షన్ హైస్కాన్ విరాళంగా అందజేసింది. మంగళవారం స్థానిక టీటీడీ పరిపాలన భవనంలో ఈఓ శ్యామలరావుకు ఆయన చాంబర్‌లో బ్యాంకు డైరెక్టర్ చంద్రారెడ్డి, రీజినల్ మేనేజర్ సంజయ్ కుమార్ ఝా స్కానర్ విరాళ మంజూరు కాపీని అందజేశారు. తిరుమల శ్రీవారి ఆలయం సమీపంలోని ఉగ్రాణం నుంచి లడ్డూ ప్రసాదాలు, అన్న ప్రసాదాల తయారీలో వినియోగించే ముడి సరుకులను శ్రీవారిపోటుకు పంపించే ముందు తనిఖీ చేసేందుకు ఈ స్కానర్‌ను వినియోగించనున్నట్లు ఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో తిరుమల ఐఓబీ మేనేజర్ మహేష్‌బాబు, మార్కెటింగ్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

- భార్యకు తీవ్ర గాయాలు

తడ : జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఎస్ఐ కొండపనాయుడు తెలిపిన వివరాల మేరకు సూళ్లూరుపేట మండలం కొమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన వేలూరు యుగంధర్(34) తన భార్య రాజ్యలక్ష్మితో కలిసి తడలో తమ బంధువుల ఇంట జరిగే ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. తడ పోలీస్ స్టేషన్ సమీపానికి వచ్చే సరికి అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో యుగంధర్ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా భార్య తీవ్ర గాయాలతో ఉండటంతో పోలీసులు సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రైవేటు పరిశ్రమలో పని చేసే యుగంధర్ ఇటీవలే ఉద్యోగాన్ని వదిలి మరో పనికి ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఇతడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్యకు.. భర్త చనిపోయిన విషయం తెలియదు. కుటుంబ సభ్యులు భర్త చనిపోయిన విషయాన్ని ఆమెకు ఎలా చెప్పాలని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

తిరుమలలో యాచకులు, అనధికార హాకర్ల తరలింపు



పోలీసులు అదుపులోకి తీసుకున్న అనధికార హాకర్లు, యాచకులు

తిరుమల : తిరుమలలో అనధికారిక హాకర్లను, యాచకులపై పోలీసులు, టీటీడీ విజిలెన్స్ శాఖ అధికారులు మంగళవారం సంయుక్తంగా దాడులు నిర్వహించి వారిని తిరుపతికి తరలించారు. తిరుమల వన్ టౌన్ పీఎస్ సీఐ విజయ్‌కుమార్, టూటౌన్ సీఐ శ్రీరాముడు ఆధ్వర్యంలో సిబ్బంది స్థానిక వరాహస్వామి అతిథి గృహం, కల్యాణకట్ట వద్ద ఉన్న 75 మంది యాచకులను, అనధికార హాకర్లను అదుపులోకి తీసుకున్నారు. వీరు కొంత కాలంగా స్థానిక హోటళ్లలో పనిచేసుకుంటూ భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు, హాళ్లను ఆక్రమించుకున్నారు. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుశాఖ, టీటీడీ విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. దీంతో పాటు ఆయా ప్రాంతాల్లోని దుకాణదారులు, హోటళ్లు, టీ దుకాణదారులకు తమ వద్ద పనిచేసే కార్మికులకు తగిన వసతి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వారి దగ్గర పని పూర్తయితే తిరుపతికి పంపే ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఇకపై ఈ ప్రత్యేక డ్రైవ్ నిరంతరాయంగా కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.